క్లుప్తంగా

ఆడబిడ్డ వివాహానికి ఆర్థిక సాయం


ఆర్థిక సాయం చేస్తున్న దశరథ్‌నాయక్ తదితరులు

కడ్తాల్: మండల కేంద్రానికి చెందిన డేరంగుల ఎల్లమ్మ- పాండు దంపతుల కుమార్తె మహేశ్వరి వివాహం ఆదివారం మండల కేంద్రంలో జరిగింది. నిరుపేద కుటుంబం కావడంతో రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ జర్పుల దశరథ్‌నాయక్ రూ.21 వేలతో పాటు, పట్టు చీరను బహూకరించారు. అదే విధంగా మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్ రూ.5 వేలు అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు కడారి రామకృష్ణ, మాజీ ఉప సర్పంచ్ శారధ, నాయకులు పాండునాయక్, లాయక్ అలీ, లక్ష్మణ్‌నాయక్, యాదయ్య, వెంకటేశ్, పాండు, రాజు, జగన్, యాదయ్య, జంగయ్య నాయకులు తదితరులు ఉన్నారు.

శ్రీపాదరావుకు నివాళి


శ్రీపాదరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

తుర్కయంజాల్: మాజీ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాద రావు జయంతిని ఆదివారం తెలంగాణ బ్రాహ్మణ సేవా సమితి తుర్కయంజాల్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన సేవలను గుర్తుచేసుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మల్‌రెడ్డి అభిషేక్ రెడ్డి, మున్సిపాలిటీ అధ్యక్షురాలు కొత్తకుర్మ మంగమ్మ, మాజీ కౌన్సిలర్లు కోశిక ఐలయ్య, కాకుమాను సునీల్, మాజీ సర్పంచ్ పూజారి శంకరయ్య గౌడ్, నాయకులు సామ భీంరెడ్డి, కొత్తకుర్మ శివ కుమార్, కుంట గోపాల్ రెడ్డి, దర్శన్ తదితరులు పాల్గొన్నారు.

కొత్త వ్యక్తులతో జాగ్రత్త


ప్రజలకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

యాచారం: కొత్త వ్యక్తుల సంచారంతో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని పోలీసులు సూచించారు. ఆదివారం మండల కేంద్రంలో సైకిలింగ్ నిర్వహించారు. గంజాయి, డ్రగ్స్ అమ్మకాలపై నిఘా ఉంచాలని, చోరీలు జరిగితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

అమరవీరులకు నివాళి


అమరవీరులకు నివాళులర్పిస్తున్న నాయకులు

పహాడీషరీఫ్: ఎమ్మార్పీఎస్ ఉద్యమ సమయంలో అసువులు బాసిన అమరవీరుల త్యాగాలు వృథా కానివ్వమని ఎమ్మార్పీఎస్ జల్‌పల్లి గ్రామ కమిటీ నాయకుడు యంజాల శివకుమార్ అన్నారు. మాదిగ అమరవీరుల సంస్మరణ దినాన్ని పురస్కరించుకొని శనివారం రాత్రి జల్‌పల్లి గ్రామంలో అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మందకృష్ణ మాదిగ ఎమ్మార్పీఎస్ స్థాపించి 30 ఏళ్ల పాటు చేసిన ఉద్యమంలో ఎంతో మంది తమ ప్రాణత్యాగాలు చేశారన్నారు. ఎస్సీ వర్గీకరణతో వారి ఆత్మకు శాంతి చేకూరుతుందన్నారు. నర్సింహ, రామారావు, యాదగిరి, మహేందర్, జంగయ్య, దానయ్య, జగన్, జ్ఞానేశ్వర్, శ్రీనాథ్, బాలకృష్ణ, అశ్విన్ కుమార్, సాయికుమార్ ఉన్నారు.

ఆయుర్వేద చికిత్సాలయం ప్రారంభం


ప్రారంభిస్తున్న ఫౌండేషన్ సభ్యులు

శంకర్‌పల్లి: పట్టణంలోని శ్రీ సరస్వతీ శిశుమందిర్ పాఠశాలలో ఏకలవ్య గ్రామీణ వికాస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ధన్వంతరి ఆయుర్వేద చికిత్సాలయాన్ని ఆదివారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా డా.విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ.. స్త్రీ, పురుషులకు ఆయుర్వేదం ద్వారా దీర్ఘకాలికంగా ఇబ్బందులు పెడుతున్న రోగాలన్నింటికీ చికిత్స అందిస్తామని స్పష్టం చేశారు. ఈ చికిత్సాలయం ప్రతి నెల మొదటి, మూడో ఆదివారాల్లో అందుబాటులో ఉంటుందని తెలిపారు.

ఇందిరమ్మ మో'డల్' హౌస్!

- నత్తనడకన ఇందిరమ్మ నమూనా ఇంటి నిర్మాణం
- గడువు దాటినా పూర్తిచేయని వైనం
- నిధులు లేనందునే జాప్యం!

ఇబ్రహీంపట్నం: ఇందిరమ్మ మోడల్ హౌస్(నమూనా ఇల్లు) నిర్మాణ పనులు మొదట్లోనే నీరసించాయి. గడువు దాటినా బేస్మెంట్‌కే పరిమితమయింది. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు పేదల సొంతింటి కలను నెరవేర్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం.. తొలివిడతగా అర్హులైన వారికి సొంత జాగ ఉంటే ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామని ప్రకటించింది. ఈ మేరకు సర్వేను పూర్తి చేసింది. ఈ పథకం కింద అర్హులకు రూ.5 లక్షల చొప్పున ఇంటి నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తామని పేర్కొన్న సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా ముందుగా ప్రతి నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇంటి మోడల్ హౌస్‌ను నిర్మించాలని నిర్ణయించింది. ఈ నమూనా ప్రకారమే లబ్ధిదారులు ఇంటిని నిర్మించుకోవాలని సూచించింది.

గడువు ముగిసినా..

పేదలకు ఇచ్చిన హామీ మేరకు తొలుత ఇబ్రహీంపట్నం మండల పరిషత్ కార్యాలయం ప్రాంగణంలోని ఖాళీ స్థలంలో మోడల్ హౌస్ నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. ఈ మేరకు జనవరి 17న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి భూమి పూజ చేశారు. నియోజకవర్గంలో 3500 ఇందిరమ్మ ఇళ్లను నిర్మించి ఇస్తామని ప్రకటించారు. ప్రస్తుత ఇంటి నిర్మాణం 45 రోజుల్లో పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఏమైందో ఏమో కాని.. గడువు ముగిసినా మోడల్ హౌస్ నిర్మాణంలో అధికారులు విఫలమయ్యారు. కేవలం బేస్మెంట్‌కే పరిమితం చేశారు.



బేస్మెంట్‌కే పరిమితమైన మోడల్ హౌస్ (ఇన్‌సెట్లో) మోడల్ నిర్మాణానికి భూమి పూజ చేసిన ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి(ఫైల్)

సొంతింటి కలకోసం..

రూ.5 లక్షలతో నిర్మించే ఇందిరమ్మ మోడల్ హౌస్ నిర్మాణానికి నిధులు రాకపోవడంతోనే జాప్యం అయిందా అనే సందేహం కలుగుతోంది. ఈ నమూనా ఇంటిని ఆదర్శంగా తీసుకొని, మిగతా ప్రాంతాల్లో నిర్మాణాలు చేపట్టాల్సి ఉంది. ఇది పూర్తి కాకపోవడంతో, ఇక ఇందిరమ్మ ఇళ్లు ఎప్పటిలోగా లబ్ధిదారులకు అందజేస్తారో చెప్పలేని దుస్థితి నెలకొంది. బీఆర్‌ఎస్ పదేళ్ల పాలనలో పేదలకు సొంతింటి కల నెరవేరలేదు. ప్రస్తుత ప్రభుత్వమైనా తమ కల నెరవేరుస్తుందని పేదలు ఆశగా ఎదురు చూస్తున్నారు.

కాలయాపన



ప్రభుత్వం కాలయాపన చేస్తోంది. ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న వారి వివరాలను అధికారులు సేకరించారు. దీంతో తమకు ఇల్లు మంజూరైందని పేదలు భావించారు. గడువులోగా నమూనా ఇంటినే పూర్తి చేయలేదు. ఇక వారి సొంతింటి కల ఎప్పుడు నిజం చేస్తారు?

– బుగ్గరాములు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు, ఇబ్రహీంపట్నం

త్వరలో పూర్తి చేస్తాం

మోడల్ హౌస్ నిర్మాణ పనులు త్వరలో పూర్తిచేస్తాం. మేస్త్రీ, లేబర్, మెటీరియల్ అందుబాటులో లేకపోవడంతో కొంత జాప్యం జరిగింది. కావాల్సిన నిధులను ప్రభుత్వం విడుదల చేస్తుంది. ప్రస్తుతం బేస్మెంట్ వరకు పూర్తయింది.

–రాంచంద్రయ్య, హౌసింగ్ ఏఈ

ముగిసిన ఉత్సవాలు


రథోత్సవంలో భక్తులు

ఆమనగల్లు: ఆమనగల్లు మండలం రాంనుంతల గ్రామ సమీపంలోని అయ్యసాగరం అటవీక్షేత్రంలో వెలసిన శ్రీ త్రిపురాంతకేశ్వరస్వామి ఆలయంలో వారం రోజులుగా జరుగుతున్న బ్రహ్మోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. ఉత్సవాల్లో భాగంగా తెల్లవారు జామున పెద్ద రథోత్సవం ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక పూజల అనంతరం భక్తులు రథం లాగి మొక్కులు తీర్చుకున్నారు. స్వామివారికి అభిషేకం, పూజలు చేశారు. చక్రతీర్థం, అమృతస్నానం, మంగళహారతితో ఉత్సవాలు ముగించారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు కరుణాకర్ రెడ్డి, నర్సిరెడ్డి, ఎన్.టి.పంచాక్షరి, మల్లప్ప, యాదగిరిరెడ్డి, యాదయ్య, వైద్యనాథ్, మాజీ సర్పంచ్ శ్రీనునాయక్, మాజీ ఎంపీటీసీ పంతునాయక్, నాయకులు రమేశ్, శేఖర్, రాజేశ్‌రెడ్డి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో ప్రభుత్వాలు విఫలం


సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు జగన్


బ్రాహ్మణపల్లిలో ఇంటింటి సర్వే చేస్తున్న సీపీఎం నాయకులు

మాడ్గుల: ప్రజా సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కందుకూరి జగన్ ఆరోపించారు. ఆదివారం ఆ పార్టీ ఆధ్వర్యంలో మండల పరిధి బ్రాహ్మణపల్లి గ్రామంలో ఇంటింటి సర్వే చేశారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. రైతులు, నిరుద్యోగులు, మహిళలు, వృద్ధులు, దివ్యాంగులను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తుందని విమర్శించారు. అర్హులకు రేషన్ కార్డులు ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. పలుమార్లు దరఖాస్తులు పెట్టుకున్నా వాటిని పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ.. ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చడం లేదన్నారు. ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం ప్రభుత్వాలు హామీలను నెరవేర్చాలని, లేదంటే వారి ఆగ్రహానికి గురికాక తప్పదన్నారు. కార్యక్రమంలో నాయకులు చంద్రయ్య, శ్రీను, అచ్చయ్య, నరసింహులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలకు వేళాయె


వేంకటేశ్వరస్వామి దేవాలయం (ఇన్‌సెట్లో) స్వామివారు



8న వేంకటేశ్వరస్వామి కల్యాణం

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలోని శ్రీ వేంకటగిరి వేంకటేశ్వరస్వామి ఆలయం బ్రహ్మోత్సవాలకు ముస్తాబవుతోంది. ఈ నెల 6 నుంచి 10 వరకు 125వ వార్షికోత్సవాలను నిర్వహించనున్నారు. ప్రతిఏడు లాగే ఈ సారి ఉత్సవాలను జరపనున్నారు. ఈ సందర్భంగా స్వామివారిని దర్శించుకునేందుకు జిల్లా నుంచే కాకుండా మహబూబ్‌నగర్, నల్గొండ, హైదరాబాద్ నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలి వస్తారని ఆలయ ధర్మకర్త గూడ కృష్ణమాచార్యులు తెలిపారు.

కార్యక్రమాల వివరాలు

ఈ నెల 6న విశ్వక్సేన ఆరాధన, పుణ్యాహవాచనం , 7న శ్రీ వారి మహాభిషేకం, ప్రత్యేక పూజలు, ఎదుర్కోళ్లు, 8న స్వామివారికి అభిషేకం, 11 గంటలకు వేంకటేశ్వరస్వామి తిరు కల్యాణం, ప్రత్యేక పూజలు, 9న ఉదయం రథోత్సవం, సాయంత్రం దోపోత్సవం, ప్రత్యేక పూజలు, భజనలు, 10న సుదర్శన హోమం, పూర్ణాహుతి, చక్రతీర్థం, శ్రీవారి ఉత్సవ సేవ కార్యక్రమాలు చేపట్టనున్నారు. ఉత్సవాల్లో భాగంగా 8న తిరుమల తిరుపతి దేవస్థానం గాయకుడు వెంకటాచలపతిచే అన్నమాచార్య గాన విభావరి నిర్వహించనున్నారు.

అతివలకు ఉపాధి కల్పనే ధ్యేయం


జాబ్‌మేళాలో మాట్లాడుతున్న రాఘవేందర్‌రెడ్డి

ఆమనగల్లు: మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా ఐక్యత ఫౌండేషన్ పనిచేస్తుందని టాస్క్ సీఓఓ, ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి అన్నారు. వారికి ఉపాధి అవకాశాలు కల్పించడానికి జాబ్‌మేళా నిర్వహించామని తెలిపారు. పట్టణంలోని ఫౌండేషన్ కార్యాలయంలో ఆదివారం మహిళా జాబ్‌మేళాను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లాలోని ప్రముఖ ఎలక్ట్రానిక్ కంపెనీల ప్రతినిధులు మహిళలకు ఇంటర్వ్యూలు నిర్వహించి, ఎంపిక చేశారు. అనంతరం సుంకిరెడ్డి మాట్లాడుతూ.. మహిళలు అన్నిరంగాల్లో రాణించాలన్నారు. అందుకోసం నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో జాబ్‌మేళాలు నిర్వహిస్తామని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వివిధ కంపెనీల ప్రతినిధులు ఉష, శ్రీకాంత్, సింహాచలం, టాస్క్ సిబ్బంది లావణ్య, నాయకులు శ్రీరాములు, నర్సింహ, రాజశేఖర్, ఫౌండేషన్ సభ్యులు చంద్రశేఖర్, అభినవ్‌రెడ్డి, కొండల్‌రెడ్డి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

స్వయం ఉపాధితో ఆర్థికంగా ఎదగాలి

ఆమనగల్లు: యువత అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుని, స్వయం ఉపాధితో ఆర్థికంగా అభివృద్ధి చెందాలని జెడ్పీటీసీ మాజీ సభ్యుడు శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. మండల పరిధి ఆకుతోటపల్లి చౌరస్తాలో గ్రామానికి చెందిన వెంకటేశ్ ఏర్పాటు చేసుకున్న స్వయం ఉపాధి పథకాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. ప్రతి ఒక్కరూ ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురు చూడకుండా స్వయం ఉపాధి అవకాశాలతో ముందుకు సాగాలని చెప్పారు.

6న ఉచిత వైద్య శిబిరం

చేవెళ్ల: మండల కేంద్రంలోని పట్నం మహేందర్ రెడ్డి ఆస్పత్రిలో ఈ నెల 6న ఉచిత ఆర్థరైటిస్ వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రామకృష్ణారెడ్డి తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనుభవజ్ఞులైన వైద్యుల ఆధ్వర్యంలో ఈ శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఆస్పత్రిలో అన్ని రకాల ల్యాబ్ పరీక్షలు కూడా ఉచితంగా నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఉచిత వైద్యశిబిరాలతో పేదలకు మేలు

ఎస్‌ఐ వనం శిరీష

చేవెళ్ల: గ్రామాల్లో నిర్వహించే ఉచిత వైద్యశిబిరాలు పేద ప్రజలకు ఎంతో మేలు చేస్తాయని ఎస్‌ఐ వనం శిరీష అన్నారు. మండలంలోని అంతారం గ్రామంలో ఆదివారం మెడికవర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్యశిబిరాన్ని ఎస్‌ఐ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతంలో ఉండే పేద ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు ఈ వైద్యశిబిరాలు ఎంతో ఉపయోగపడుతాయని తెలిపారు. గ్రామానికి చెందిన యువ నాయకులు వెంకటేశ్‌బాబు, తరుణ్ తదితరులు ప్రత్యేక చొరవ తీసుకొని వైద్యశిబిరాలు ఏర్పాటు చేయటంపై వారిని ప్రత్యేకంగా అభినందించారు. ఇలాంటి కార్యక్రమాలు తరచూ నిర్వహించాలని సూచించారు. ప్రజలకు వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆస్పత్రి వైద్యుల బృందం, గ్రామ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.


వైద్యపరీక్షలు చేయించుకుంటున్న ఎస్‌ఐ శిరీష

సృష్టికి మూలం భగవద్గీత

త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి అధ్యక్షురాలు సద్గుణ

కేశంపేట: భగవద్గీత సృష్టికి మూలమని, ప్రతి ఒక్కరూ చదవాలని త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి, హిందూ జ్ఞానవేదిక షాద్‌నగర్ కమిటీ అధ్యక్షురాలు సద్గుణ అన్నారు. పాల్గుణ మాసం ప్రారంభం సందర్భంగా మండల పరిధిలోని వేములనర్వ గ్రామంలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి, హిందూ జ్ఞానవేదిక షాద్‌నగర్ కమిటీ ఆధ్వర్యంలో భగవద్గీతపైన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సద్గుణ మాట్లాడుతూ.. పాల్గుణ మాసంలో వచ్చే హోళీ పండుగ విశిష్టతను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని సూచించారు. పండుగ అంటే మనిషి జ్ఞానిగా మారడమని, పండుగ రోజు పనులను వదిలేసి దేవుడి గురించి తెలుసుకునేందుకు కృషి చేయాలని తెలిపారు. ద్వాపర యుగంలో శ్రీకృష్ణుడు అర్జునుడికి గీతోపదేశం చేశారన్నారు. గీతోపదేశం పొందిన అర్జునుడు ఫల్గుణుడిగా మారాడన్నారు. యోగి ప్రబోధానంద యోగ పీఠం శ్రీశ్రీశ్రీ ఆచార్య యోగీశ్వరస్వామి రచించిన 100 ఆధ్యాత్మిక రచనలను గ్రామంలో ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో షాద్‌నగర్ కమిటీ సభ్యులు శోభ, వాసంతి, నవ్య, గౌతమి, స్వాతి, కుల్దీప్ రెడ్డి, ఆనంద్, సుదీర్, ధన్వంతరి, సామ్రాట్ తదితరులు పాల్గొన్నారు.


ఇంటింటి ప్రచారం చేస్తున్న హిందూ జ్ఞానవేదిక సభ్యులు

పంటకు రక్షణగా..

షాబాద్: పంటలను రక్షించుకునేందుకు రైతులు అనేక పాట్లు పడుతున్నారు. విత్తనం నాటినప్పటి నుంచి దిగుబడి చేతికందే వరకు పంటను కంటికిరెప్పలా కాపాడుకుంటారు. ఓ రైతు రేగడిదోస్వాడ గ్రామ సమీపంలో మొక్కజొన్న పంటను పందుల బారి నుంచి రక్షించుకునేందుకు పంట చుట్టూ చీరలు కట్టారు.

మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్


కడ్తాల్‌లో.. పండ్లు పంపిణీ చేస్తున్న నాయకులు

సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు వంశీచంద్‌రెడ్డి

ఆమనగల్లు: మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ విందు అని కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే, సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు చల్లా వంశీచంద్‌రెడ్డి అన్నారు. రంజాన్‌మాసం ప్రారంభం సందర్భంగా ఆదివారం పట్టణంలో కాంగ్రెస్ పార్టీ మైనార్టీ నాయకుడు ఖాదర్ ఇఫ్తార్‌విందు ఇచ్చారు. విందుకు హాజరైన ఆయన.. ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, కడ్తాల్, ఆమనగల్లు కాంగ్రెస్ మండలాల అధ్యక్షులు బిచ్యానాయక్, జగన్, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు మానయ్య, నాయకులు వెంకటేశ్, ఖాదర్, కరీం, రహీం, అలీం, విజయ్, ఫరీద్, నాజర్ పాల్గొన్నారు.

కడాల్‌లో..

రంజాన్‌ను పురస్కరించుకుని.. కడ్తాల్ మండల కేంద్రంలోని పాత మసీదులో సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీ నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో ముస్లింలకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మసీదు కమిటీ అధ్యక్షులు, నాయకులు మౌలిసాబ్, అబ్దుల్ రవూఫ్, జావీద్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు దశరథ్‌నాయక్, మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్, మాజీ ఉపసర్పంచ్ రామకృష్ణ, నాయకులు లాయక్ అలీ, జహంగీర్ అలీ, ఇర్షద్, ఇమ్రాన్, రాఘవచారి, రామచంద్రయ్య, వెంకటేశ్, మహేశ్, చెన్నయ్య, సురేశ్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.


ఆమనగల్లు: ముస్లింలకు శుభాకాంక్షలు తెలుపుతున్న వంశీచంద్‌రెడ్డి

మౌలిక సదుపాయాల కల్పనలో విఫలం


సమస్యలు తెలుసుకుంటున్న నాయకులు

సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు రాంచందర్

కందుకూరు: స్వాతంత్ర్యం వచ్చి 80 ఏళ్లు గడుస్తున్నా నేటికీ పేదలకు మౌలిక సదుపాయాలు కల్పించడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు రాంచందర్ విమర్శించారు. సీపీఎం పార్టీ పిలుపుమేరకు ఆదివారం మండల పరిధిలోని నేదునూరు గ్రామంలో పార్టీ నాయకులతో కలిసి ఆయన పర్యటించి గ్రామస్తుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామంలో నిరుపేదలకు ఇళ్ల స్థలాలు, ఇళ్లు లేక తీవ్ర అవస్థలు పడుతున్నారన్నారు. 2006 తర్వాత మళ్లీ ఇంతవరకు కొత్త రేషన్‌కార్డులు ఇవ్వలేదన్నారు. అర్హులైన వృద్ధులకు పింఛన్లు అందడం లేదన్నారు. మండలంలోనే పెద్ద గ్రామ పంచాయతీ అయిన నేదునూరును విస్మరించడం బాధాకరమన్నారు. సమస్యలు పరిష్కరించేవరకు ప్రజల వెంట ఉండి పోరాడుతామన్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల నాయకుడు బి.శ్రీనివాస్, ఎ.కుమార్, గ్రామ కార్యదర్శి ఎం.యాదయ్య, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

దాతల సహకారం మరువలేనిది

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: ప్రభుత్వ జూనియర్ కళాశాల నిర్మాణానికి దాతలు అందిస్తున్న సహకారం మరువలేనిదని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. పట్టణంలో దాతల సహకారంతో నిర్మిస్తున్న ప్రభుత్వ జూనియర్ కళాశాల భవన నిర్మాణానికి ఆదివారం స్లాబ్ చేశారు. ఈ పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేద విద్యార్థులకు అత్యాధునిక వసతులతో కూడిన కళాశాలను దాతల సహకారంతో నిర్మిస్తున్నట్లు తెలిపారు. కళాశాల నిర్మాణానికి దాతలు తోడ్పాటు అందించడం హర్షణీయమన్నారు. వారి సహకారం మరిచిపోలేనిదని, వారి పేరు ఎల్లప్పుడూ చిరస్థాయిగా నిలిచిపోతుందన్నారు. వచ్చే విద్యా సంవత్సరం వరకు పనులు పూర్తిచేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు.